క్లుప్తంగా

వైభవంగా లక్ష తులసి పూజ



లక్ష తులసి పూజ చేస్తున్న మహిళలు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని రాజావీధిలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం గోవింద మాల భక్త సమాజం ఆధ్వర్యంలో లక్ష తులసి పూజ, కుంకుమార్చనను ఘనంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం భారీగా అన్నదానం చేశారు.

వ్యాపారులతో అధికారుల చర్చలు



దుకాణదారులతో మాట్లాడుతున్న అధికారులు

కోట: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని దుకాణదారులతో శనివారం అధికారులు చర్చలు జరిపారు. పంచాయతీకి అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలని ఆదేశించారు. ఎంపీడీవో భవాని, ఈవోపీఆర్డీ నయీమ్ మాట్లాడుతూ కోర్టు ఆదేశాల మేరకు దుకాణదారులు 63 నెలల అద్దెను కోట పంచాయతీకి జమ చేయాల్సి ఉందన్నారు. 25 మంది వ్యాపారులకు నోటీసులు జారీ చేశామని తెలిపారు. అద్దె చెల్లించని పక్షంలో ఖాళీ చేయించి వేలం పాటల ద్వారా కొత్త వారికి కేటాయిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

అధ్వానంగా సైదాపురం-పాదలకూరు రోడ్డు



అధ్వానంగా మారిన రోడ్డు

సైదాపురం: మండలంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు సైదాపురం-పాదలకూరు రోడ్డు అధ్వానంగా మారింది. అక్కడ గుంతలు పడి నీరు నిల్వ ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత



మాట్లాడుతున్న డీఎల్‌పీవో కార్యాలయ ఏవో భువనేశ్వర్‌శర్మ

ఓజిలి: గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని డీఎల్‌పీవో కార్యాలయ ఏవో భువనేశ్వర్ శర్మ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం గ్రామ పంచాయతీల సాధారణ పరిపాలనపై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, ఇంటి పన్నుల వసూలు తదితరాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించి ఎరువులు తయారుచేసి ఆదాయం పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీల్లో రికార్డుల నిర్వహణ కచ్చితంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ



మాట్లాడుతున్న ఏవో భువనేశ్వర శర్మ

నాయుడుపేట : మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు శనివారం పంచాయతీల సాధారణ పరిపాలనపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో శివప్రసాద్, డీఎల్‌పీవో కార్యాలయ ఏవో భువనేశ్వరశర్మ పలు విషయాలను వివరించారు. కార్యక్రమంలో ఈవో పీఆర్డీ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధనారీశ్వర ఆలయ పనుల తనిఖీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ అనుబంధ అర్ధనారీశ్వస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన పనులను పరిశీలించారు. పనుల ఆలస్యంపై ఆరా తీశారు. వచ్చే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల లోపు పనులు పూర్తి చేసి కుంభాభిషేకం నిర్వహించే విధంగా పనులు పూర్తి చేయాలన్నారు. గతంలో ఎకరా మాత్రమే ఉండేదని, ప్రస్తుతం 10 ఎకరాల పరిధిలో ఆలయం పునర్నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆలయంలో సప్తగోశాల ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందుకు సంబంధించిన పనులు జరుగుతున్నట్లు చెప్పారు. ఆలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న వ్యవసాయ పనులు





వరినాట్లు వేస్తున్న కూలీలు

• పెరిగిన పంటల సాగు విస్తరణ

సైదాపురం: మండలంలో గత వారంలో కురిసిన భారీ వర్షాలకు చెరువులన్నీ నిండి కలుజులు పారుతున్నాయి. దీంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. గతంతో పోలిస్తే ఈ ఏడాది పంటల సాగు విస్తీర్ణం పెరిగిందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. సైదాపురంలోని మూడు చెరువులు, ఊటుకూరు, తిప్పిరెడ్డిపల్లి, అనంతమడుగు, కలిచేడు, తురిమెర్ల, గిద్దలూరు, చాగణం, కొమ్మిపాడు, చీకవోలు, ఆర్‌వైజీపాళెం తదితర ప్రాంతాల్లోని చెరువులు, వాగులు, వంకలు నీటితో కళకళలాడుతున్నాయి. దీంతో ఆయకట్టు రైతులు పనుల్లో నిమగ్నమయ్యారు. వరినారు సిద్ధంగా ఉన్న వారు నాట్లు వేస్తున్నారు. కొంతమంది నారుమడులను సిద్ధం చేసుకుంటున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు నిండుతున్నాయని రైతులు చెబుతున్నారు. చంద్రబాబు నాయుడి హయాంలో మూడేళ్లకొకసారి కూడా పంటలను సాగు చేసుకునే పరిస్థితి ఉండేది కాదని పేర్కొంటున్నారు. కండలేరు డ్యామ్ నుంచి తెలుగు గంగ 26–2 బీ కెనాల్ నుంచి చెరువులకు నీటిని విడుదల చేసేవారని, దాంతో కొంత మేర మాత్రమే పంటలు సాగు చేసుకునేవారమని చెబుతున్నారు. వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రతి ఏటా చెరువులు నిండుతున్నాయని పేర్కొంటున్నారు.

గ్రామం	ఆయకట్టు (ఎకరాల్లో)	టీడీపీ హయాంలో	ప్రస్తుతం
సైదాపురం	270	100	210
మొలకలపూండ్ల	120	50	120
గిద్దలూరు మూడు చెరువులు	1200	500	1200
కలిచేడు	450	230	450
తలుపూరు	380	150	380
అనంతమడుగు	245	110	200
రామసాగరం రెండు చెరువులు	650	150	470
వేములచేడు	180	80	120
రాజులెరుగుంటపాళెం	170	50	140
చీకవోలు రెండు చెరువులు	350	140	300
కొమ్మిపాడు	110	35	89
తురిమెర్ల	50	–	35
దేవరవేమూరు	246	150	210
కమ్మవారిపల్లి	150	–	100
గంగదేవిపల్లి	235	170	220

చాలా సంతోషంగా ఉంది



ఈ ఏడాది మొదట్లో వర్షాలు కురవలేదు. కండలేరు డ్యామ్‌లో కూడా నీటి నిల్వలేకపోవడంతో పంటలు సాగు చేయడానికి అవకాశం ఉండదని అనుకున్నాం. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులన్నీ నిండి కలుజులు పారుతున్నాయి. వ్యవసాయం చేసేందుకు అన్ని గ్రామాల ప్రజలు సన్నద్ధమవుతున్నారు. చాలా సంతోషంగా ఉంది.

\- శ్రీనివాసులురాజు రాజుఎరుగుంటపాళెం, సైదాపురం మండలం

సాగునీటికి కొరత లేదు



మండలంలో ఇటీవలన కురిసిన వర్షాలకు చెరువులన్నీ నిండి మరవలు పోతున్నాయి. గతంలో నీరు లేక ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని రైతులకు కోరాం. ప్రస్తుతం చెరువులన్నీ నిండడంతో వరి పంటను సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. పంటల సాగులో తీసుకోవాల్సిన మెళకువలను ఎప్పటికప్పుడు తెలుపుతున్నాం.

\- హైమావతి, ఏవో, సైదాపురం

రైతులకు వరి విత్తనాలు పంపిణీ



రైతులకు విత్తనాలు అందజేస్తున్న అధికారులు



విత్తనాలు అందజేస్తున్న ఏవో భవాని

దొరవారిసత్రం : భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకు శనివారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద 80 శాతం సబ్సిడీతో వరి విత్తనాలు పంపిణీ చేశారు. ప్రస్తుతం 180 క్వింటాళ్ల కేఎన్ఎం 1638 వరి రకం అందుబాటులో ఉంచామని ఏవో జ్యోతిర్మయి తెలిపారు. అవసరమైతే మరో 70 క్వింటాళ్లు తెప్పిస్తామన్నారు. ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ, వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, ఎంపీడీవో రఘురామయ్య, ఎంఈవో కృష్ణయ్య, ఏఈ మోహన్‌రావు పాల్గొన్నారు.

80 శాతం రాయితీతో విత్తనాలు

చిల్లకూరు : భారీ వర్షాలతో వరిమడులు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం 80 శాతం రాయితీతో విత్తనాలు ఇస్తోందని ఏవో జి.భవాని తెలిపారు. ఆమె శనివారం తిక్కవరం ఆర్బీకే పరిధిలోని రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ కడివేడు పీఏసీఎస్ గోదాము, తిక్కవరం ఆర్బీకేల వద్ద కేఎన్ఎం–1638 రకం విత్తనాలు ఉన్నాయని తెలిపారు. అవసరమైన రైతులు పేర్లు నమోదు చేసుకుని రాయితీపై విత్తనాలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆర్బీకేల వద్ద డీబీటీ విధానంలో యూరియా ఇస్తున్నట్లు తెలిపారు.

చిట్టమూరులో..

చిట్టమూరు : మండలంలోని అరవపాళెం పంచాయతీ గ్రామ సచివాలయంలో శనివారం రైతులకు రాయితీ విత్తనాలు పంపిణీ చేశారు. ఏవో సుచేంద్రప్రసాద్ మాట్లాడుతూ భారీ వర్షాలకు మండలంలో సుమారు 2 వేల ఎకరాల్లో వరి నాట్లు, నారుమడులు దెబ్బతిన్నాయని తెలిపారు. నష్టపోయిన రైతులకు 80 శాతం రాయితీతో ఎన్ఎల్ఆర్- 3440 (నెల్లూరు మసూర), కేఎన్ఎం 1638 స్వల్పకాలిక వరి విత్తనాలు అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. వ్యవసాయ సంచాలకులు సునంద, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ



బియ్యం, సరుకులు అందజేస్తున్న అధికారులు

దొరవారిసత్రం : వరద బాధితులకు అన్ని విధాలా ఆదుకుంటామని ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భారీ వర్షాలకు నష్టపోయిన ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం రూ.2500, బియ్యం, నిత్యావసర సరుకులు అందజేసినట్టు తెలిపారు. అనంతరం శాఖల వారీగా ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధిపై చర్చించారు. వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు త్వరితగతిన మరమ్మతులు చేస్తామన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందును వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సూచించారు. రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు ఇచ్చి మంచి దిగుబడులు వచ్చేందుకు వ్యవసాయధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, ఎంపీడీవో రఘురామయ్య పాల్గొన్నారు.

వరద బాధితులకు సరుకులు

దొరవారిసత్రం : మండల కేంద్రమైన దొరవారిసత్రంలోని 180 మంది వరద బాధితులకు శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నవజీవన్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు నెల రోజులకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, ఎంపీడీవో రఘురామయ్య, నవజీవన్ సంస్థ అధినేత సహదేవయ్య, హెచ్ఎం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

రాపూరు: మండలంలో భారీ వర్షాలకు ఇళ్లు దెబ్బతిన్న 17 మందికి ఆర్థిక సాయం అందజేసినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఆంజనేయపురంలో ఇళ్ల దెబ్బతిన్న నాగభూషణంకు శనివారం ఆర్థిక సహాయాన్ని వలంటీరు కృష్ణ ద్వారా నగదు అందజేసినట్లు తెలిపారు.

పరిహారం పంపిణీ

వాకాడు : మండలంలోని బాలిరెడ్డిపాళెంలో భారీవర్షాలకు ఇళ్లు కోల్పోయిన నలుగురికి శనివారం రూ.4.80 లక్షలు అందజేసినట్టు పీఏసీఎస్ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ బాలిరెడ్డిపాళెం స్వర్ణముఖి నదికి గండిపడి నాలుగు ఇళ్లు వరదలో కొట్టుకుపోయాయని తెలిపారు. వాటిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా పరిశీలించారని తెలిపారు. ఒక్కొక్కరికి రూ.1.20 లక్షల చొప్పున రూ.4.80 లక్షలు మంజూరు చేశారని పేర్కొన్నారు. అలాగే గ్రామంలో 800 కుటుంబాలకు 25 కిలోల చొప్పున బియ్యం, సరుకులు, రూ.2500లు అందజేసినట్టు వెల్లడించారు. తహసీల్దార్ నరసింహారావు, ఎంపీడీవో టి.గోపీనాథ్ పాల్గొన్నారు.



నగదు పరిహారం అందజేస్తున్న దామోదర్‌రెడ్డి

రేపు స్కంధ షష్టి మహోత్సవం

చిట్టమూరు : మండలంలోని మల్లాంలో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్కంధ షష్టి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ చిల్లకూరు సాయికుమార్‌రెడ్డి తెలిపారు. ఉదయం సుప్రభాతంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. మధ్యాహ్నం అన్నదానం చేస్తామన్నారు.

సైదాపురంలో ట్రాఫిక్ జామ్

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురం తహసీల్దార్ కార్యాలయం సమీపంలో అధిక లోడుతో వెళుతున్న లారీ ఇరుక్కుపోవడంతో శనివారం రాత్రి నుంచి సైదాపురం- పాదలకూరు రోడ్డులో రాకపోకలు స్తంభించాయి. అధిక లోడుతో ఖనిజాన్ని తరలిస్తున్న లారీ గుంతలో దిగబడడంతో వాహనాలు వెళ్లేందుకు వీలుకాకుండా పోయింది. దీంతో గూడూరు -పాదలకూరు రోడ్డులో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకునే నాథుడేకరువయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఓట్ల తొలగింపులో జాగ్రత్తలు తీసుకోవాలి



ఓటరు నమోదు దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంఈవో మునిరత్నం

నాయుడుపేట టౌన్ : ఓట్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పరిశీలన అధికారి, ఎంఈవో మునిరత్నం తెలిపారు. ఆయన నాయుడుపేట మున్సిపాలిటీకి సంబంధించి ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తొలగింపులు తదితర వాటికి పరిశీలన అధికారిగా నియమితులయ్యారు. ఆయన 37 పోలింగ్ బూత్‌లో తొలగింపులు, చేర్పులు, మార్పులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్ల తొలగింపులకు సంబంధించి ఆన్‌లైన్‌తో పాటు నేరుగా వచ్చిన దరఖా స్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. 6, 7, 8 ఫారాలకు సంబంధించి తప్పుడు దరఖాస్తు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆటో బోల్తా

చిల్లకూరు : మండలంలోని జాతీయ రహదారిపై శనివారం రాత్రి ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. తిప్పగుంటపాళెంకు చెందిన కొంతమంది కూలీలు పనుల కోసం గూడూరు వచ్చి తిరిగి ఆటోలో స్వగ్రామానికి బయలుదేరారు. వరగలి క్రాస్ రోడ్డు సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్‌ఐ అంజిరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

గూడూరు రూరల్ : మండలంలోని దివిపాళెం వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీటిలో శనివారం ఈతకు వెళ్లి యువకుడు మృతి చెందాడు. కోట మండలం ఊసుగుంటపాళెంకు చెందిన గుత్తి సుధీర్(20) గూడూరులో పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవలే పెళ్లి కావడంతో ప్రస్తుతం చిల్లకూరులో నివసిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. మిత్రులు వెంటనే సుధీర్‌ను వెలికి తీసి సమీపంలోని చిల్లకూరు పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

జామియా మసీదుకు నిధులివ్వాలని వినతి



ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషాకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని జామియా మసీదు అభివృద్ధికి రూ.14.75 లక్షలు మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి, మైనారిటీ శాఖా మంత్రి అంజాద్‌బాషాను కోరినట్టు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు తెలిపారు. విజయవాడలో శనివారం ఉప ముఖ్యమంత్రిని కలిసి వినతి పత్రం అందజేసినట్టు తెలిపారు. అదేవిధంగా కోటలో ఈద్గా, మసీదులకు ప్రహరీ గోడ నిర్మాణాలకు రూ.45 లక్షలు మంజూరు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.


వైఎస్సార్‌సీపీ విజయానికి సైనికుల్లా పనిచేద్దాం



ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట టౌన్ : సూళ్లూరుపేట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి సైనికుల్లా పనిచేద్దామని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పిలుపునిచ్చారు. ఆయన శనివారం తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు సుధీర్‌కుమార్‌రెడ్డి సమక్షంలో ఎస్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, సీనియర్ నాయకులు సారధ్యంలో శుక్రవారం నాయుడుపేటలో నిర్వహించిన వైఎస్సార్ సీపీ నాయకుల ఆత్మీయ సమావేశాన్ని దిగ్విజయం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సీఎం జగనన్న ఆదేశాల మేరకు పార్టీలో అందరినీ కలుపుకుని 2024 ఎన్నికల్లో పార్టీని విజయపథంలో నడిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ఆడుదాం ఆంధ్రాను సద్వినియోగం చేసుకోండి



నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. పేర్ల రిజిస్ట్రేషన్ గడువు ను ప్రభుత్వం పొడిగించిందని, క్రీడాకారులు తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. క్రీడాకారులను ప్రోత్సహించి వారిలోని నైపుణ్యం, సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రభుత్వంఈకార్యక్రమాన్ని అమలుచేస్తున్నట్టు చెప్పారు.

కల్యాణం కమనీయం



స్వామి, అమ్మవార్లకు కల్యాణం చేస్తున్న అర్చకులు



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మిదేవి కల్యాణం, ఊంజల్ సేవను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే స్వామి, అమ్మవార్లను సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం అభిషేకం, పూలంగి సేవ చేశారు. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి నిత్యకల్యాణ మండపంలో కొలువుదీర్చారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య కల్యాణాన్ని నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు స్వామి, అమ్మవార్లను తిరుచ్చిలో కొలువుదీర్చి సహస్ర దీపాలంకరణ మండలంలోకి వేంచేపు చేసి ఊజంల్ సేవ చేశారు.

పేదల సంక్షేమమే ధ్యేయం



వరద బాధితులకు సరుకులు అందజేస్తున్న ఎస్‌ఐ రఘునాథ్, సహదేవయ్య

నాయుడుపేట టౌన్ : పేద, బడుగు బలహీన వర్గాల వారి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్టు నవజీవన్ ఆర్గనైజేషన్ సంస్థ వ్యవస్థాపకుడు కె.సహదేవయ్య తెలిపారు. పట్టణంలోని ఇండియన్ బ్యాంక్ సమీపంలో ఉన్న ఆ సంస్థ కార్యాలయంలో శనివారం వరద బాధితులు ఒక్కొక్కరికి రూ.2,200 విలువైన బియ్యం బస్తా, నిత్యావసర సరుకులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు ముంపునకు గురైన నిరుపేదలకు తమ సంస్థ తరపున సహాయక కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో ముంపునకు గురైన ప్రాంతాల్లో రెండు వేల కుటుంబాలకు ఒక్కొక్కరికి బియ్యం బస్తా, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఎస్‌ఐ రఘునాథ్ మాట్లాడుతూ పేదలకు సహాయక కార్యక్రమాలు చేస్తున్న సంస్థ వ్యవస్థాపకులను అభినందించారు. మేనేజర్ బాలాజీ, వలంటీర్లు హేమలత, రాధిక, సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 13.118 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 13.118 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. జలాశయానికి వరద కాలువ నుంచి 100 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

21న ఆత్మీయ సమావేశం

వెంకటగిరి రూరల్ : ఈ నెల 21న వెంకటగిరి పట్టణంలోని నేదురుమల్లి నివాసంలోని ఎన్‌జేఆర్ భవనంలో వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నారు. ఇందులో సోషల్ మీడియా ప్రతినిధులు తప్పక పాల్గొనాలని నేదురుమల్లి కార్యాలయ ప్రతినిధులు ఒక ప్రకటనలో కోరారు.

లక్ష్మీనరసింహస్వామికి ఘనంగా పల్లకి సేవ



విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు

చిల్లకూరు : మండలంలోని కలవకొండలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకి సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి, చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి అమ్మవార్లకు విశేష అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా గ్రామానికి చెందిన దొంతి చంద్రయ్య, వసంతమ్మ వ్యవహరించారు. కామరెడ్డి అమర్‌నాథ్‌రెడ్డి కుమారుడు ఉదయ్‌కిరణ్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను పల్లకిలో ఉంచి ఊరేగించారు.